క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి వాలీబాల్ క్రీడా పోటీలలో సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని పీఈటీ రాజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ 13న సిద్దిపేటలో నిర్వహించిన అండర్ 15 వాలీబాల్ ఎంపికల్లో తమ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థులు దుర్గేశ్, అభిషేక్ ఎంపికయ్యారని చెప్పారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం అనసూయ, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



స్టిక్కర్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల కేంద్రంలో ప్రమాదకరంగా ఉన్న చౌరస్తాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో గురువారం ఎస్‌ఐ సైఫ్ అలీ స్టిక్కర్లు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదకరంగా ఉన్న చౌరస్తాల వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు అందుకు సహకరించాలని, అతివేగంగా నడపవద్దని సూచించారు. మద్యంసేవించి వాహనాలు నడిపే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీచర్‌ల చేయూత అభినందనీయం



క్రీడా దుస్తులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థుల అవసరాలు గుర్తించి ఉపాధ్యాయులు దాతలుగా మారి చేయూతనివ్వడం అభినందనీయమని ఎంఈఓ యాదవరెడ్డి ప్రశంసించారు. మండల పరిధిలోని రామంచ మదిర దాసరివాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు వేణు, మాధవి, బాలస్వామిల సహకారంతో 50 మంది విద్యార్థులకు గురువారం క్రీడా దుస్తులు, బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ సొంత డబ్బులు వెచ్చించి విద్యార్థులకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి తిరుపతి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రాజవ్వ, ఉపాధ్యాయులు పద్మారెడ్డి, దేవదాసు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యాధరి సేవలో వైశ్య కార్పొరేషన్ చైర్మన్



అమ్మవారి సన్నిధిలో కార్పొరేషన్ చైర్మన్ సుజాత

వర్గల్(గజ్వేల్): చదువుల తల్లి కొలువైన వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రాన్ని గురువారం రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత సందర్శించారు. ఆమెకు ఆలయవర్గాలు సాదర స్వాగతం పలకగా, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. వేదపండితులు శేషవస్త్రంతో సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ సరస్వతి మాతను దర్శించుకోవడం తన అదృష్టం అన్నారు. ప్రతి ఒక్కరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ మోహన్ తదితరులు ఉన్నారు.

బ్యాంక్ సిబ్బంది సంబురాలు

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంక్ బ్రాంచ్ లావాదేవీలు గురువారం 100 కోట్లు దాటాయని ఆ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంక్‌లో గురువారం కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ మైలు రాయిని అధిగమించడానికి బ్యాంక్‌తోపాటు ప్యాక్స్ సిబ్బంది సహకారం ఎంతో ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ వాసు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లిలో గ్రామ దేవతలకు గురువారం బోనాలు సమర్పించుకొని మొక్కు లు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అలాగే ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పోశమ్మ తల్లికి బోనాలు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం

అంతా మా ఇష్టం.. మేము ఏం చేసినా ఎవరూ.. ఏమీ చేయలేరన్నట్టు వ్యవహరిస్తున్నారు కొంత మంది దుకాణదారులు. దుబ్బాక పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారీతిన అక్రమంగా నిర్మాణాలు వెలుస్తున్నాయి.

రోజురోజుకు రోడ్డుపైకి నిర్మాణాలు

- పట్టించుకోని అధికారులు
- చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



రోడును ఆక్రమించి నిర్మించిన ఫుడ్ సెంటర్

దుబ్బాకటౌన్: పట్టణంలో పాతరోడ్డు, కొత్తరోడ్డు, బస్టాండ్, తెలంగాణ తల్లి సర్కిల్, లాల్ బహదూర్ శాస్త్రి, పోచమ్మ గుడి, తదితర ప్రాంతాల్లో దాదాపు 300లకు పైగా వివిధ రకాల దుకాణాలు నిర్మించారు. వారిలో కొంత మంది హద్దులు మీరారు. రోడ్డును ఆక్రమించారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధికారుల చర్యలేవి?

కొంత మంది రోడ్డుపక్క కొంత స్థలాన్ని ఆక్రమించి దుకాణాలు నిర్మిస్తున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. నిబంధనలను అతిక్రమించి హద్దులు మీరుతున్నా.. చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన జంక్షన్లలో రోడ్డుపై కొంత మంది షెడ్లు నిర్మించి విక్రయాలు జరుపుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఎలాంటి పరిశీలనా జరపకుండానే అధికారులు ట్రేడ్ లైసెన్స్‌లు ఇస్తున్నారా? అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చర్యలు తీసుకోండి సారూ..



రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వినియోగదారుల వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేసి వెళ్తున్నారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు అదుపుతప్పి నిర్మాణాలను ఢీకొంటే వారి పరిస్థితేంటి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. - మాడబోయిన శ్రీకాంత్, దుబ్బాక

కఠిన చర్యలు తప్పవు



దుకాణాదారులు రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేదే లేదు. మొదటి హెచ్చరికగా నోటీసులు జారీచేస్తాం స్పందన లేకపోతే చట్టప్రకారం అక్రమ నిర్మాణాలను కూల్చేస్తాం. - రమేశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

ఉత్సవాలకు సిద్ధం..

బాట లక్ష్మీనరసింహుని ఆలయం

- నేటి నుంచి 5రోజులపాటు వేడుకలు
- 18న స్వామి వారి కల్యాణం





ముస్తాబైన బాటలక్ష్మీ నర్సింహస్వామి ఆలయం

మర్కూక్(గజ్వేల్): శ్రావణమాసం ఉత్సవాలకు బాటలక్ష్మీ నర్సింహ స్వామి ఆలయం ముస్తాబైంది. ప్రతియేటా శ్రావణమాసంలో 5 రోజుల పాటు స్వామి వారి ఉత్సవాలు కనులపండువగా నిర్వహిస్తారు. ఈ ఆలయం మర్కూక్ మండలంలోని గణేశ్‌పల్లిలో సుమారు 500 సంవత్సరాల క్రితం వెలసినట్లు అర్చకులు చెబుతున్నారు. అప్పటి నుంచి ప్రతియేటా పరిసర గ్రామాల ప్రజలు ఉపవాస దీక్షలు చేస్తారు. అలాగే ప్రతి శని, సోమవారాల్లో పిల్లాపాపలతో వచ్చిఎడ్లబండ్లతో గుడిచుట్టూ తిరిగి మొక్కులు చెల్లించుకొని పూజాకార్యక్రమాలు నిర్వహిస్తారు. తమ కోరికలు నెరవేరుతాయని, పాడి పంటలు చల్లగా ఉంటాయని వారి నమ్మకం. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం సహకరిస్తే రెండో యాదాద్రిగా పేరొందుతుందని అర్చకులు సూచిస్తున్నారు.

రోజువారీ కార్యక్రమాలు

- 15న స్వస్తి పుణ్యాహవనం, రక్షాబంధనం, దీక్షా ధారణ, అంకురారోపణము, ధ్వజారోహణము, మంత్ర పుష్పము అనంతరం తీర్థ ప్రసాద వితరణ
- 16న ఉదయం సుప్రబాత సేవ, ఆరాదణ, పంచామృతాభిషేకం, మూల మంత్ర సహిత మహాసుదర్శన యాగం, సాయంత్రం మంటపార్చన
- 17న తిరువారాదణ, ఉమామహేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, సాయంత్రం మండపార్చన, హోమం, ఏకాంత సేవ
- 18న ఉమామహేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, అద్యపూర్ణాహుతి, 11:30 నిమిషాలకు నరసింహస్వామి కల్యాణ మహోత్సవం, అన్నదానం, సాయంత్రం స్వామి వారి పల్లకీసేవ, తీర్థ ప్రసాద వితరణ
- 19న ఉమామహేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, చక్రస్నానం బలి హరణము, ఏకాంత సేవ అనంతరం ఘనంగా ఉత్సవాలు ముగింపు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్



మహిళకు మొక్క అందజేస్తున్న ఆశ్రిత్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రతిఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొంటేనే ఆరోగ్యంగా ఉండొచ్చని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. పట్టణంలోని 20వ వార్డులో గురువారం ఆయన పర్యటించారు. హనుమాన్ దేవాలయం పక్కన ఉన్న భవనం శిథిలావస్థకు చేరడంతో ఆ యజమానులకు నోటీసులు జారీ చేయాలని, అక్కడ ఉన్న మురుగు కాలువపై కల్వర్టు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీలలో వ్యర్థాలు వేసిన వారికి జరిమానా విధించాలని చెప్పారు. అనంతరం వార్డులో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని లబ్ధిదారులకు సూచించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చాంబర్లను రోడ్డులెవెల్‌లో ఉండేలా ఎత్తు పెంచాలని, నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని సూచించారుర. వార్డు అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. అనంతరం కాలనీవాసులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రియాజొద్దిన్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సెట్విన్‌లో ఉపాధి నైపుణ్య శిక్షణ

గజ్వేల్‌రూరల్: నిరుద్యోగ యువతకు సెట్విన్ ద్వారా రాయితీపై ఉపాధి నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు సెట్విన్ ఇన్‌చార్జి ఎంఏ ఖదీర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కోటమైసమ్మ ఆలయ సమీపంలోగల సెట్విన్ కేంద్రంలో పదో తరగతి ఉత్తీర్ణులైన యువతకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఆరు నెలల కాలపరిమితితో టీచర్ ట్రైనింగ్(పీపీటీసీ), ఫ్రిజ్, ఏసీ రిపేర్, ఎలక్ట్రీషియన్, సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్; అలాగే మూడు నెలల కాలపరిమితితో ఎంఎస్ ఆఫీస్, డీటీపీ, మహిళలకు కుట్టులో శిక్షణ, మగ్గం వర్క్, మెహందీ, బ్యూటీషియన్‌పై నామమాత్రపు రుసుముతో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ యువతీ, యువకులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8790810172 నంబరులో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ భూమిలో దర్జాగా వెంచర్లు

- పట్టాభూమి పేరుతో దందా
- ఆందోళనకు దిగిన బాధితులు
- పాఠశాల బస్సులు అడ్డగింత



ఓ ప్రైవేటు పాఠశాల ఎదుట బాధితుల ఆందోళన

కొండపాక(గజ్వేల్): ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలోని కొంత భూమిలో ఏర్పాటు చేసిన వెంచర్ ప్రభుత్వ భూమిలో ఉందంటూ కొనుగోలు చేసిన బాధితులు గురువారం వెంచర్ వద్ద ఆందోళనకు దిగారు. విద్యార్థులతో వచ్చే స్కూల్ బస్సులను లోపలికి వెళ్లనీయకుండా గేట్ వద్ద అడ్డుకున్నారు. గ్రామ శివారులో కొన్నేళ్ల నుంచి 156 సర్వేనంబరులో సుమారు ఆరెకరాల పట్టా భూమి లో ఓ ప్రైవేటు పాఠశాల నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పాఠశాలలోనికి వెళ్లే దారి పక్కన ఉన్న కొంత భూమిలో రెండెళ్ల కిందట వెంచర్ వేసి ప్లాట్లు విక్రయించారు. రాజీవ్ రహదారికి సమీపంలో ఉంటుందన్న నమ్మకంతో వివిధ గ్రామాలకు చెందిన వారు ఆ ప్లాట్లు కొనుగోలు చేశారు. తీరా ఇప్పుడు అది భూమి ప్రభుత్వ భూమని తేలడంతో ఖంగుతిన్నారు. ప్లాట్లను కొనుగోలు చేసిన వారికి 156 సర్వే నంబరులో రిజిస్ట్రేషన్లుచేసి ప్లాట్ల రూపంలో అప్పగించినది మాత్రం 271 ప్రభుత్వ భూమిలో.. అయితే ఈ విషయం ఆరు నెలలకు వెలుగులోకి రావడంతో బాధితులు వెంచర్ నిర్వాహకులను సంప్రదించగా అలాంటిది ఏమీ ఉండదంటూ దాటవేస్తూ వస్తున్నాడన్నారు. కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ చేరుకొని వెంచర్ నిర్వాహకులు, బాధితులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

ఏసీపీ నర్సింహులు



వాహనాలు పరిశీలిస్తున్న ఏసీపీ నర్సింహులు

వర్గల్(గజ్వేల్): విధినిర్వహణలో అధికారులు, సిబ్బంది అలసత్వం వహించవద్దని ఏసీపీ నర్సింహులు సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా గురువారం వర్గల్ మండలం గౌరారం పోలీస్‌స్టేషన్ సందర్శించారు. స్టేషన్ పరిసరాలు, వివిధ కేసులలో సీజ్ చేసిన వాహనాలు, రిసెప్షన్, స్టేషన్ రికార్డులు, సీడీ ఫైల్స్, సిబ్బంది కిట్ ఆర్టికల్స్ పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. సీజ్ చేసిన వాహనాలను సాధ్యమైనంత త్వరగా యజమానులకు అందజేయాలని, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు సమాచారం సేకరించాలని ఆదేశించారు. కేసుల పరిశోధన పారదర్శకంగా కొనసాగాలని, కేడీలు, రౌడీలపై మరింత నిఘా పెంచాలని చెప్పారు. ఆయన వెంట గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డిరెడ్డి, ఏఎస్‌ఐలు పోచగౌడ్, రుక్కమ్మ, సిబ్బంది ఉన్నారు.

ఉన్నత పౌరులుగా ఎదగాలి

త్రీటౌన్ సీఐ విద్యాసాగర్



విద్యార్థినిని అభినందిస్తున్న సీఐ

సిద్దిపేటఅర్బన్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి సమాజంలో ఉన్నత పౌరులుగా ఎదగాలని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. గురువారం వికాస్ హైస్కూల్లో నిర్వహించిన ఓ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమశ్రేణితో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్ అద్భుతంగా ఉందని అభినందించారు. కార్యక్రమంలో హై స్కూల్ సీబీఎస్‌ఈ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమ, ప్రిన్సిపాల్ మధుమోహన్, ఉపాధ్యాయుడు రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వాల నిర్లక్ష్యం

యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రవి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

గజ్వేల్‌రూరల్: విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని యూఎస్‌ఎఫ్‌ఐ(భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్) రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి ప్రైవేటీకరిస్తున్నారన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి కోట్ల రూపాయల దోపిడీచేస్తున్నా పట్టించుకున్న పాపానపోవడం లేదని ఆరోపించారు. గజ్వేల్‌లో 30, 31వ తేదీలలో నిర్వహిస్తున్న యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను విద్యావంతులు, మేధావులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రవి, శేఖర్, హేమంత్, రాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముందస్తు శ్రీకృష్ణాష్టమి

శ్రీకృష్ణాష్టమి వేడుకలను ముందస్తుగా జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో గురువారం విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. అనంతరం ఉట్టిలు కొట్టారు.



కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలోని వేదా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 'ఆదర్శ'లో ఉట్టి కొడుతున్న శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారి



కోహెడ(హుస్నాబాద్): కోహెడ ఆదర్శ పాఠశాలలో గోపిక, కృష్ణుడి వేషధారణలో పిల్లలు

సంక్షిప్త వార్తలు

◆ **పిడుగు పడి గేదె మృతి**

చేర్యాల(సిద్దిపేట): పిడుగు పడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని ఆకునూరులో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొయినేని యాదయ్య తన గేదెను రోజు లాగానే బుధవారం రాత్రి తన వ్యవసాయబావి వద్ద కట్టేసి వచ్చాడు. గురువారం ఉదయం వెళ్లి చూడగా గేదె మృతి చెంది ఉంది. రాత్రి వర్షం కురిసినపుడు పిడుగు పడి అది మృతి చెందినట్లు వాపోయాడు.

◆ **ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'**

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు జాతీయ పతాకంతో సెల్ఫీలు తీసుకుని హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని సర్టిఫికెట్లు పొందారు. అలాగే ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వనమహోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మొక్కలు పెంచాలని పిలుపునిచ్చారు. మధుసూదన్, పిట్ల దాసు, మహేశ్ కుమార్, సంపత్ కుమార్‌రెడ్డి, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

◆ **బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి**

సిద్దిపేటరూరల్: ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభంపై నుంచి కిందపడి మృతి చెందిన యాదగిరి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ పంచాయతీ ఉద్యోగులు, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఏఓ రెహమాన్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేశ్ మాట్లాడారు.

◆ **రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక**

గజ్వేల్‌రూరల్: రాష్ట్రస్థాయి అండర్-15 వాలీబాల్ పోటీలకు మోడల్‌స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వన్నెసా గురువారం తెలిపారు. సిద్దిపేటలో జరిగిన జిల్లా జట్టు ఎంపికలో పాఠశాలకు చెందిన జి.లావణ్య, సీహెచ్ శృతికీర్తన, జి.శ్రీజ, సీహెచ్ వైష్ణవి అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

◆ **మోడల్‌స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు**

గజ్వేల్‌రూరల్: బాలికల ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలోగల మోడల్‌స్కూల్‌లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వన్నెసా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు 20న జరగనున్న స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలని, మరింత సమాచారం కోసం స్కూల్‌లో సంప్రదించాలని సూచించారు.

◆ **క్రీడా దుస్తులు అందజేత**

దుబ్బాకరూరల్/బెజ్జంకి(సిద్దిపేట)/హుస్నాబాద్‌రూరల్: పలు పాఠశాలల విద్యార్థులకు దాతలు గురువారం క్రీడా దుస్తులు, షూలు అందజేశారు. అక్బరోపేటభూంపల్లి మండల పరిధిలోని నగరంలో గ్రామస్తుడు వినయ్; బెజ్జంకి మండలంలోని గుండారం ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ లత, దేవయ్య, సంపత్‌గౌడ్; హుస్నాబాద్ మండలం కూచనపెల్లి ప్రభుత్వ పాఠశాలలో మడప పెద్దిరెడ్డి క్రీడా దుస్తులు, షూలు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో ఎంఈఓ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.